క్లుప్తంగా

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కాజీపేట అర్బన్: సబ్‌స్టేషన్లలో మరమ్మతుల్లో భాగంగా వడ్డేపల్లి, బాలసముద్రం, సోమిడి లోని సబ్‌స్టేషన్ల పరిధిలో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని హనుమకొండ టౌన్ డీఈఈ సాంబరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వడ్డేపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని రాఘవేంద్రనగర్, స్నేహనగర్, బాలయ్య హోటల్ ప్రాంతాల్లో ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు, బాలసముద్రం సబ్ స్టేషన్ పరిధిలోని పద్మాక్షికాలనీ, శివ ముక్తి ధామం, రాజ్‌పుత్ వాడ, జయ కళాశాల ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, సోమిడి సబ్‌స్టేషన్ పరిధిలోని విష్ణుపురి, వాటర్ ట్యాంక్ ప్రాంతం, పోలీస్‌స్టేషన్, త్రిపుల్ ఎస్ కాంప్లెక్స్, సోమిడి ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

నేడు సంకటహర చతుర్థి పూజలు

కాజీపేట: సంకటహర చతుర్థిని పురస్కరించుకుని కాజీపేట 63వ డివిజన్ జూబ్లీ మార్కెట్ ఆవరణలోని అభయాంజనేయ స్వామి దేవాలయంలో గురువారం సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుడు జాగర్లపూడి శ్రీనివాస్ శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయంలో గణపతి హోమంతో పాటు దేవతామూర్తులకు అభిషేకాలు, అర్చనలు జరిపించనున్నట్లు పేర్కొన్నారు.

ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా కర్ణాకర్‌రెడ్డి



హసన్‌పర్తి: హసన్‌పర్తి ఇన్‌చార్జ్ మండల అభివృద్ధి అధికారిగా కర్ణాకర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈమేరకు కలెక్టర్ ప్రావీణ్య ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం కర్ణాకర్‌రెడ్డి హసన్‌పర్తి మండల పంచాయతీ అధికారిగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇక్కడ మండల అభివృద్ధి అధికారిగా పనిచేస్తున్న ప్రవీణ్‌కుమార్ సంస్కృతీ విహార్‌లోని శిక్షణ కేంద్రానికి బదిలీ అయ్యారు. కాగా, బాధ్యతలు స్వీకరించిన కర్ణాకర్‌రెడ్డి బుధవారం కలెక్టర్ ప్రావీణ్యను మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేశారు.

నేత్రదానం



రాజమౌళి (ఫైల్)

హసన్‌పర్తి: ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన హసన్‌పర్తికి చెందిన చెన్నూరి రాజమౌళి నేత్రాలు దానం చేశారు. రాజమౌళి కుమారుడు రవి అంగీకారం మేరకు మృతుడి నేత్రాలను హైదరాబాద్‌లోని ఎల్‌వీ ప్రసాద్ కంటి వైద్యశాల సిబ్బంది మంగళవారం సేకరించారు. ఈ సందర్భంగా సర్టిఫికెట్ అందజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాంచంద్రారెడ్డి, బీజేపీ వరంగల్ పార్లమెంట్ కన్వీనర్ తాళ్లపల్లి కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

స్రవంతికి డాక్టరేట్



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల పరిశోధకురాలు గొడిశాల స్రవంతికి యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. పర్‌ఫార్మెన్స్ అనాలసిస్ ఆఫ్ టెలికాం ఇండస్ట్రీ – ఎ స్టడీ ఆఫ్ సెలెక్ట్ ఎంటర్‌ప్రైజెస్ అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ రాజేందర్ తెలిపారు. ఆ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ కృష్ణమాచార్య పర్యవేక్షణలో స్రవంతి తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

నిత్యావసరాల పంపిణీ



మడికొండ: సంక్రాంతి పండుగ సందర్భంగా నిరుపేద కుటుంబానికి నెలకు సరిపడా నిత్యావసర సరుకులను మడికొండ పోలీసు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ జయరాజ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తమకు తోచిన విధంగా పేదవారికి సహాయం చేయాలని సూచించారు. ప్రతీ పండుగకు ఒక పేద కుటుంబానికి సరుకులు అందజేస్తున్నట్లు ఆయన వివరించారు.

మార్కెట్ ఏర్పాటు చేయండి



హన్మకొండ చౌరస్తా: హనుమకొండ 4వ డివిజన్ యాదవనగర్‌లో ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న 200 గజాల ప్రభుత్వ స్థలంలో కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేయాలని స్థానిక కార్పొరేటర్ బొంగు అశోక్‌యాదవ్ కోరారు. ఈమేరకు స్థానికులతో కలిసి బాలసముద్రంలోని ప్రజాభవన్‌లో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.

ఎన్నికల కరపత్రం ఆవిష్కరణ

మడికొండ: అఖిల గాండ్ల తెలికుల సంఘం కమిటీ ఎన్నికల కరపత్రాలను మడికొండలోని గాండ్ల నాగయ్య ఇంటి ఆవరణలో బుధవారం ఆవిష్కరించారు. ఫిబ్రవరి 9న ఎన్నికలు నిర్వహించనున్నట్లు నాయకులు తెలిపారు.

రోడ్డు.. గుంతలమయం

- అధ్వానంగా అలంకార్ టు మచిలీబజార్ దారి
- పదేళ్లుగా ప్రతిపాదనలతో సరి
- అస్తవ్యస్తంగా సైడ్ డ్రెయినేజీ
- కుండీలు లేక రోడ్డు వెంటే చెత్త
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



వేయిస్తంభాల గుడి వెనుక కంకరతేలి గుంతలమయంగా మారిన రోడ్డు



మచిలీబజార్ కమ్యూనిటీ హాల్ సమీపంలో అధ్వానంగా ఉన్న సైడ్ డ్రెయినేజీ

హన్మకొండ చౌరస్తా: హనుమకొండలోని మచిలీబజార్ నుంచి అలంకార్ జంక్షన్‌కు వెళ్లే ప్రధాన దారి అధ్వానంగా తయారైంది. అడుగుకో గుంత ఆదమరిస్తే అంతేసంగతులు అన్నట్లుగా మారిన రోడ్డుపై వాహనదారులకు అవస్థలు తప్పడం లేదు. గడిచిన పదేళ్లుగా ఈ రోడ్డు అభివృద్ధికి అనేకసార్లు ప్రతిపాదనలు రూపొందించినప్పటికీ అమలుకు నోచుకోవడం లేదు. పాలకులు, అధికారులు పట్టించుకోవడం లేదు.

గుంతలమయం

హనుమకొండ బస్టాండ్ నుంచి వరంగల్‌కు వెళ్లే ఆటోలు, ద్విచక్ర వాహనదారులకు ఈ రోడ్డు షార్ట్‌కట్‌గా చెప్పొచ్చు. ఈ దారిలో ఎక్కువ శాతం నివాసాలే ఉన్నాయి. వర్షాకాలంలో గుంతల్లో నీరు నిల్వడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నిధుల కొరతతో..

మచిలీబజార్‌లోని మారమ్మ చెట్టు నుంచి అలంకార్ జంక్షన్ వరకు రోడ్డు నిర్మాణానికి గత ప్రభుత్వం అనేకసార్లు ప్రతిపాదనలు రూపొందించింది. నిధుల కొరతతో రోడ్డు నిర్మాణం చేయలేదనే ఆరోపణలు ఉన్నాయి. కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంలో మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు రోడ్డు అభివృద్ధికి మరోమారు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిసింది. అయితే, ఏడాది కావస్తున్నా నూతన రోడ్డును నిర్మించడంలో పాలకులు, అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. అధ్వానంగా మారిన రోడ్డుకు తోడు సైడ్ డ్రెయినేజీ అస్తవ్యస్తంగా మారింది. మురుగునీరు నిలిచి దుర్వాసనతో పరిసరాల ప్రాంతాలు కంపుకొడుతున్నాయి. వర్షాకాలంలో మురుగునీరు రోడ్డుపైకి చేరడంతో పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యలకు తోడు రోడ్డు వెంట చెత్తను కుప్పలుగా పోస్తుండడంతో పందులు, కుక్కలు, దోమలు స్వైర విహారం చేస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు.

అనేక సార్లు విన్నవించాం



వర్షాకాలంలో మచిలీబజార్‌లోని మారమ్మ చెట్టు నుంచి హనుమాన్ టెంపుల్ వరకు రోడ్డుపై వరద నీరు నిలుస్తోంది. మోకాలు లోతులో నీరు నిలిచి నడవడానికి కూడా కష్టంగా ఉంటోంది. గుంతల్లో నీరు నిలిచి వాహనదారులు రోడ్డు ప్రమాదాల బారిన పడుతున్నారు. సైడ్ డ్రెయినేజీ సరిగా లేకపోవడంతో మురుగునీరు రోడ్డుపైకి చేరుతోంది. ఈ విషయాన్ని కార్పొరేషన్‌లో అనేక సార్లు వినతిపత్రాలు అందజేసినా అధికారులు పట్టించుకోలేదు.

– పులి హరికృష్ణ, మచిలీబజార్

నిధులు మంజూరయ్యాయి



కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన అనతికాలంలోనే 10వ డివిజన్‌లో సుమారు రూ.2 కోట్ల అభివృద్ధి పనులు చేశాం. పదేళ్లుగా ప్రతిపాదనలకే పరిమితమైన మచిలీబజార్ మారమ్మ చెట్టు నుంచి అలంకార్ జంక్షన్ వరకు సుమారు రూ.1 కోటి వ్యయంతో సీసీ రోడ్డు, సైడ్ డ్రెయినేజీ నిర్మాణ పనుల కోసం స్మార్ట్ సిటీ నిధులు మంజూరు అయ్యాయి. అందుకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ పూర్తి అయింది. త్వరలోనే పనులను ప్రారంభిస్తాం.

– తోట వెంకటేశ్వర్లు, కార్పొరేటర్, 10వ డివిజన్

గోదాదేవి రంగనాథుల కల్యాణం



తాళిబొట్టు చూపిస్తున్న శ్రీనివాసాచార్య స్వామి



కాపువాడలో వేడుకలను తిలకిస్తున్న భక్తులు

హన్మకొండ కల్చరల్: హనుమకొండ వికాస్‌నగర్ శ్రీరామ నిలయంలోని గోదామాధవ ఆధ్యాత్మిక కేంద్రంలో గోదామాధవ ఆధ్యాత్మిక కేంద్రం నిర్వాహకుడు ఆరుట్ల శ్రీనివాసాచార్యస్వామి ఆధ్వర్యంలో గోదాదేవి రంగనాథుల కల్యాణ మహోత్సవం శోభాయమానంగా జరిగింది. విష్వక్సేనారాధన, పుణ్యాహ వచనం, రక్షాసూత్రధారణ, యజ్ఞోపవీత ధారణ, కన్యావరణం, కన్యాదానం, మహాసంకల్ప పఠనం, వాసుదేవ పుణ్యావచనం, జీలకర్ర బెల్లం, గోదాఅమ్మవారికి మంగళసూత్ర ధారణ, అక్షతారోపణ, బ్రహ్మవందనం, పూలదండల మార్పు, బ్రాహ్మణ ఆశీర్వాదం మహాదాశీర్వచనం తదితర కల్యాణ తంతులను నిర్వహించారు. కార్యక్రమంలో కేంద్రం సభ్యులు వెన్నపురెడ్డి రమణారెడ్డి, సరళ దంపతులు, భద్రాచలానికి చెందిన బంజర రామాలయం నిర్వాహకులు రాంరెడ్డి, చంద్రకళ దంపతులు, భక్తులు పాల్గొన్నారు.

10వ డివిజన్ కాపువాడలో..

హన్మకొండ చౌరస్తా: హనుమకొండ 10వ డివిజన్ కాపువాడలోని లక్ష్మీనరసింహ స్వామి దేవాలయంలో బుధవారం గోదా రంగనాథుల కల్యాణ మహోత్సవ వేడుకలు కనులపండవగా జరిగాయి. వేడుకలకు హాజరైన ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి.. స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కార్యక్రమంలో కార్పొరేషన్ ఫ్లోర్ లీడర్ తోట వెంకటేశ్వర్లు, డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు కుమార్‌యాదవ్, ఆలయ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

చీరల పంపిణీ



హన్మకొండ అర్బన్: నగరంలోని పద్మాక్షికాలనీలోని ఆనందనగర్ కాలనీలోని లెప్రసీ బాధిత కుటుంబాలకు సౌమ్య బెజవాడ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం చీరలు పంపిణీ చేశారు. ట్రస్ట్ ద్వారా వరదలు, ఇతర ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు బాధితులకు అండగా నిలుస్తున్నామని, రెండు తెలుగు రాష్ట్రాల్లో పేదలు, వికలాంగులు, రోగులకు బాసటగా నిలుస్తూ వారికి ట్రస్ట్ తరుపున తోచిన సహాయం అందిస్తున్నామని ట్రస్ట్ చైర్మన్ బెజవాడ సౌమ్య వివరించారు. కార్యక్రమంలో పాస్టర్లు సుకుమార్, రాజేష్, బ్రదర్ విజయ్‌కుమార్, జేమ్స్‌పాల్, అశోక్, డానియేల్, చిన్నబాబు, దయాకర్, స్నేహ, మమత, రాకేష్, జ్యోతి, డాక్టర్ మధుపాక ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చు

హసన్‌పర్తి: సంక్షేమ పథకాల కోసం చేసుకున్న దరఖాస్తు చేసుకోకపోతే మళ్లీ దరఖాస్తుకు అవకాశం ఉందని హసన్‌పర్తి మండల పరిషత్ అభివృద్ధి అధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో వివిధ విభాగాలకు చెందిన అధికారులు, ప్రత్యేక అధికారులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ పలు సూచనలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త ఆహార భద్రత కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల విధి విధానాలపై సమీక్షించారు. నాలుగు పథకాలు ఈనెల 26వ తేదీ నుంచి అమలు చేయనున్నట్లు తెలిపారు. ఈనెల 16వ తేదీ నుంచి రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డుల కోసం ఇంటింటి సర్వే చేపట్టాలని సూచించారు. సర్వే పారదర్శకంగా ఉండాలని చెప్పారు. డేటా ఎంట్రీలో తప్పులు దొర్లకుండా చూడాలన్నారు. ఈనెల 21నుంచి 24వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ తెలిపారు.

వర్గీకరణతోనే ఎస్సీలకు న్యాయం

హసన్‌పర్తి: వర్గీకరణతోనే ఎస్సీలకు న్యాయం జరుగుతుందని మండల మాదిగ జేఏసీ నాయకుడు చాతళ్ల వేణుగోపాల్ అన్నారు. వచ్చే నెల 7న హైదరాబాద్‌లో నిర్వహించనున్న వెయ్యి గొంతుకలు – లక్షల డప్పులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ హసన్‌పర్తి మండలం పెంబర్తి గ్రామంలో బుధవారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పును అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాదిగ డప్పుల కళాకారుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా కొయ్యడ నాగార్జున, ప్రధాన కార్యదర్శులుగా సారం ప్రవీణ్, ఇల్లందుల మొగిలి, గౌరవ అధ్యక్షుడిగా చాతళ్ల వేణుగోపాల్, ఉపాధ్యక్షులుగా రవి, సారం రాజేష్, కార్యదర్శిగా ముస్కుల రాజు, కోశాధికారిగా కొయ్యడ రణధీర్, ప్రచార కార్యదర్శిగా కొయ్యడ రాజు ఎన్నికయ్యారు.

విజయవంతం చేయాలి

వరంగల్: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఫిబ్రవరి 7వ తేదీన నిర్వహించ తలపెట్టిన 'లక్ష డప్పులు.. వేల గొంతులు' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దేశాయిపేట రోడ్డు వర్తక సంఘం శాశ్వత అధ్యక్షుడు ఆడెపు రవీందర్ పిలుపునిచ్చారు. పోచమ్మమైదాన్ జంక్షన్‌లో రాణి రుద్రమదేవి విగ్రహం వద్ద బ్యానర్‌ను బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఇమ్మానియల్, బి.కుమారస్వామి, యాదగిరి, కుమార్, సుధాకర్ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

బాల్యం గుర్తుకొస్తోంది

హసన్‌పర్తి: పతంగులు ఎగురవేస్తుంటే తనకు బాల్యం గుర్తుకొస్తోందని కార్పొరేటర్ శివకుమార్ అన్నారు. స్విమ్మర్స్ అండ్ వాకర్స్ అసోసియేషన్, హసన్‌పర్తి ఆధ్వర్యంలో మంగళవారం కైట్ ఫెస్టివల్ నిర్వహించారు. స్విమ్మర్స్ అండ్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్దమ్మ శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సభ్యుడు పిట్టల కుమారస్వామి, ఆత్మ జిల్లా మాజీ అధ్యక్షుడు కందుకూరి చంద్రమోహన్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాంచంద్రారెడ్డి, స్థానికులు అనుమాండ్ల విద్యాసాగర్, పవన్, సుమన్ పాల్గొన్నారు.

నిరవధిక నిరాహార దీక్షను విరమింపజేయాలి

దేశాయిపేట: కేంద్ర ప్రభుత్వం తక్షణమే రైతుల డిమాండ్లను పరిష్కరించాలని ఖన్నౌరిలో 51 రోజులుగా నిరవధిక నిరాహార దీక్ష చేస్తున్న రైతు నాయకుడు జగ్జీత్‌సింగ్ ధల్లేవాలా దీక్షను విరమింపజేయాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు ఒక ప్రకటనలో కోరారు. పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించాలని, స్వామినాథన్ కమిషన్ సిఫారసులు అమలు చేయాలని తెలిపారు. నిరవధిక నిరాహార దీక్షతో జగ్జీత్‌సింగ్ ఆరోగ్యం పూర్తిగా క్షీణించినా కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం అత్యంత దుర్మార్గమన్నారు.

క్రీస్తు బోధనలు ప్రపంచ శాంతికి దోహదం

మడికొండ: క్రీస్తు బోధనలు ప్రపంచ శాంతికి దోహదపడుతాయని వర్ధన్నపేట ఎమ్మెల్యే కర్నె నాగరాజు అన్నారు. గ్రేటర్ వరంగల్ పరిధిలోని 46వ డివిజన్ మడికొండలోని ఆల్ఫా ఒమేగా చర్చి 17వ మందిర ప్రతిష్ఠ కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. కార్యక్రమంలో ఏఐసీసీ నాయకుడు పులి అనిల్‌కుమార్, పాస్టర్ జాన్ మార్కండేయ్య, మాజీ కార్పొరేటర్ తొట్ల రాజుయాదవ్, బైరి లింగమూర్తి, మెట్టుగుట్ట చైర్మన్ పైడిపాల రఘుచందర్, తూర్పాటి అబ్బసాయిలు, తదితరులు పాల్గొన్నారు.

సీతారామచంద్ర స్వామి ఆలయంలో పూజలు

మడికొండ: పునర్వసు నక్షత్రం సందర్భంగా సీతారామచంద్ర స్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం యాగశాలలో గణపతి హోమం, రుద్ర హోమం నిర్వహించారు. శ్రీరాముడి జన్మనక్షత్రం సందర్భంగా భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారికి అర్చనలు, అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి శేషుభారతి, చైర్మన్ పైడిపాల రఘుచందర్, ధర్మకర్తలు, రొడ్డ దయాకర్, బోగి కేదారి, దండిగం శ్రీనివాస్, వస్కుల ఉమ, జ్ఞానేశ్వరి, అర్చకులు రాగిచేడు అభిలాష్‌శర్మ, పరాశరం విష్ణువర్ధనచార్యులు, సత్యనారాయణ శర్మ, మణిశర్మ, సాయిశర్మ, భక్తులు అద్దెంకి సురేష్, వెంకన్న, నర్సింహ పాల్గొన్నారు.

శ్వేతార్క ఆలయంలో పశువులకు పూజలు

కాజీపేట: కనుమ పండుగను పురస్కరించుకుని కాజీపేట స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో పాడి పశువులకు అర్చకులు బుధవారం పూజలు చేశారు. ఆలయం గోశాలలో ఉన్న గోవులకు ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. గోమాతతో పాటు ఎద్దులను భక్తితో పూజించడం వల్ల కలిగే ఫలితాలను భక్తులకు ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు అయినవోలు వెంకటేశ్వర్లు శర్మ అనుగ్రహ భాషణం చేశారు. కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్, ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులు రాధాకృష్ణ శర్మ, సాయికృష్ణ శర్మ పాల్గొన్నారు.

సామూహిక లాలీ గౌరమ్మ నోము

వరంగల్ చౌరస్తా: వరంగల్ రామన్నపేటలో సామూహిక లాలీ గౌరమ్మ నోమును బుధవారం నిర్వహించారు. లక్ష పసుపు కొమ్ములు, శ్రీకృష్ణ తులాభారం చేశారు. వనమాల సంధ్యారాణి, అనంతుల శ్రీలత ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో సుమారు 200 మంది మహిళలు పాల్గొన్నారు. కార్యక్రమంలో సరిత, రాధ, రమాదేవి, ఉమ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పతంగుల పంపిణీ

హసన్‌పర్తి: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని వాసవి క్లబ్ హసన్‌పర్తి శాఖ ఆధ్వర్యంలో పతంగులను మంగళవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఇంటర్నేషనల్ వాసవి క్లబ్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ చకిలం రాజేశ్వర్‌రావు హాజరై మాట్లాడుతూ సంస్కృతీ సంప్రదాయాలను పరిరక్షించుకోవాలని సూచించారు. క్లబ్ అధ్యక్షుడు సంద్రు నాగేందర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి పురవర్ధన్, కోశాధికారి మాధవశంకర్ పాల్గొన్నారు.

తప్పిపోయిన వ్యక్తి గుర్తింపు

ఖిలా వరంగల్: నేపాల్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు కోయంబత్తూర్‌కు కూలీ పనుల కోసం రైలు ఎక్కి వెళ్తుండగా ఓ వ్యక్తికి అనారోగ్య సమస్య తలెత్తడంతో అర్ధంతరంగా వరంగల్ రైల్వేస్టేషన్‌లో ఈనెల 11న సుభాష్‌సింగ్, సునీల్ సింగ్ పాస్వన్ ట్రైన్ దిగారు. సుభాష్‌సింగ్‌ను అక్కడే ఉంచి ఆస్పత్రి వివరాలు తెలుసుకునేందుకు సునీల్ వెళ్లి సాయంత్రమైనా తిరిగి రాలేదు. సుభాష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న క్రమంలో జనగామ రైల్వేస్టేషన్‌లో సునీల్ ప్రత్యక్షమయ్యాడు. అతడిని సుభాష్‌కు అప్పగించినట్లు జీఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సురేందర్ వివరించారు.

బాధితుడికి సూట్‌కేసు అందజేత

ఖిలా వరంగల్: వరంగల్ రైల్వేస్టేషన్ మూడో ప్లాట్‌ఫారంపై విలువైన సూట్‌కేసును మర్చిపోయి ట్రైన్ దిగి ఇంటికి ప్రయాణికుడు వెళ్లాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న క్రమంలో బుధవారం ఆ సూట్‌కేసును గుర్తించి బాధితుడికి అందజేసినట్లు జీఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సురేందర్ తెలిపారు.

ఘనంగా సంక్రాంతి వేడుకలు



మడికొండ: కొత్తకొండ జాతరకు ఎడ్ల బండ్లపై వెళ్తున్న ప్రజలు



వరంగల్ చౌరస్తా: విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు



హసన్‌పర్తి: ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు, యువతులు, చిన్నారులు

మడికొండ: కాజీపేట మండలంలోని మడికొండ, ఉనికిచర్ల, టేకులగూడెం, కుమ్మరిగూడెం, రాంపూర్, అయోధ్యపురం తదితర గ్రామాల్లో సంక్రాంతి పండుగ సంబరాలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయం ఇళ్ల ముందు వాకిళ్లలో రంగురంగుల ముగ్గులు వేశారు. చిన్నారులు గాలి పటాలు ఎగురవేస్తూ సందడి చేశారు. పలు గ్రామాల నుంచి ప్రజలు కొత్తకొండ, ఐనవోలు జాతరలకు ఎడ్ల బండ్లపై తరలివెళ్లారు.

ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు

వరంగల్ చౌరస్తా: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని వరంగల్ 27వ డివిజన్‌లోని గోవిందరాజుల గుట్ట ఆవరణలో మంగళవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ చింతాకుల అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగిన పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకుడు ఎండీ.అయూబ్, డాక్టర్ సంస్కార భారతి ప్రతినిధులు బందెల మోహన్ రావు, కుమారస్వామి, రాయుళ్ల రవి, చూచన క్రాంతికుమార్, ప్రశాంతి, రాజేశ్వరరావు, మల్లయ్య, గురుదేవ్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

హసన్‌పర్తిలో ముగ్గుల పోటీలు

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండల కేంద్రంలోని రాజరాజేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు కందుకూరి చంద్రమోహన్ ఆధ్వర్యంలో మంగళవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమాన్ని పురస్కరించుకుని పతంగులు పంపిణీ చేశారు.

సమ్మక్కను దర్శించుకున్న ఎమ్మెల్సీ సారయ్య



సంక్షేమ పథకాల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ సారయ్య, నాయకులు

వరంగల్: మేడారం సమ్మక్క, సారలమ్మను రాష్ట్ర శాసనమండలి సభ్యుడు బస్వరాజు సారయ్య బుధవారం దర్శించుకుని మొక్కులు సమర్పించుకున్నారు. అనంతరం ప్రభుత్వ ప్రతిష్ఠాత్మకంగా జనవరి 26నుంచి అమలు చేయనున్న సంక్షేమ పథకాల పోస్టర్లను అమ్మవారి సన్నిధిలో ఆవిష్కరించారు. కాగా, వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని పలువురు కాంగ్రెస్ ముఖ్య నేతలు ఆయన వెంట నాలుగు ప్రత్యేక బస్సుల్లో బయలుదేరి వెళ్లడం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నా పార్టీలోని సీనియర్ నేతలకు తగిన ప్రాధాన్యం ఇవ్వడం లేదని పలువురు మదనపడుతున్నారు. ఈక్రమంలో పలువురు నేతలు సారయ్య వెంట మేడారం వెళ్లడంతో తూర్పులో రాజకీయ సమీకరణాలు మారే అవకాశాలున్నట్లుగా సీనియర్లు అంటున్నారు. మేడారం వెళ్లిన వారిలో వరంగల్ జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కొరిమి పరమేష్, 20వ డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేంద్రకుమార్, మాజీ కౌన్సిలర్ దూపం సంపత్, సీనియర్ నాయకులు బస్వరాజు కుమార్, గోరంటల రాజు, కరాటే ప్రభాకర్ తదితరులు ఉన్నారు.

రైల్వే క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



బ్యాటింగ్ చేస్తున్న వెంకటకుమార్

కాజీపేట రూరల్: రిపబ్లిక్ డేను పురస్కరించుకొని రైల్వే జనరల్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను కాజీపేట రైల్వే స్టేడియంలో బుధవారం ప్రారంభించారు. రైల్వే సీనియర్ డీఈఈ, ఇన్‌స్టిట్యూట్ చైర్మన్ ప్రశాంత్ కృష్ణసాయి, రైల్వే సీనియర్ డీఎంఈ, ఇన్‌స్టిట్యూట్ వైస్ చైర్మన్ వెంకటకుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రైల్వే కార్మికులకు క్రీడలు నిర్వహించడం అభినందనీయమని అన్నారు. ఇన్‌స్టిట్యూట్ సెక్రటరీ దేవుళ్లపల్లి రాఘవేందర్ మాట్లాడుతూ క్రికెట్, బిలియర్డ్స్, స్నూకర్స్, క్యారమ్స్, చెస్, వివిధ రకాల ఆటలను నిర్వహిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో రైల్వే మజ్దూర్ యూనియన్ జోనల్ ప్రెసిడెంట్ కె.శ్రీనివాస్, డివిజన్ సెక్రటరీ పి.రవీందర్, ఇన్‌స్టిట్యూట్ జాయింట్ సెక్రటరీ రాజయ్య, ట్రెజరర్ రాజేశ్వర్‌రావు, సభ్యులు ప్రశాంత్, ప్రవీణ్, రవికిరణ్, సదానందం పాల్గొన్నారు.

ఇందిరమ్మ కాలనీలో దొంగల బీభత్సం


- తాళం వేసి ఉన్న రెండు ఇళ్లల్లో చోరీలు



ఇంటి వద్ద గుమిగూడిన కాలనీవాసులు

వరంగల్: సంక్రాంతి పండుగ సందర్భంగా ఇళ్లకు తాళాలు వేసి దైవ దర్శనానికి వెళ్లగా దొంగలుపడి సొత్తు దోచుకుపోయిన సంఘటన వరంగల్ ఏనుమాముల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇందిరమ్మ కాలనీ ఫేజ్ –2లో సోమవారం జరిగింది. కాలనీలోని రెండు ఇళ్లలో దొంగలు పడి బంగారు. వెండి ఆభరణాలతో పాటు కొంత నగదును దోచుకుపోయారని ఇన్‌స్పెక్టర్ రాఘవేందర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మద్దూరి వినోద తమ కుటుంబ సభ్యులతో సోమవారం వేములవాడ రాజన్న దర్శనానికి వెళ్లారు. మంగళవారం తిరిగి వచ్చే చూసేసరికి ఇంటికి వేసిన తాళం పగులగొట్టి ఉండడంతో లోపలకు వెళ్లి చూడగా బెడ్రూంలోని బీరువా పగులగొట్టి అందులో ఉన్న సుమారు 4.5 తులాల బంగారు ఆభరణాలు, 25 తులాల వెండి ఆభరణాలతో పాటు కొంత నగదు దొంగలు దోచుకుపోయినట్లు గుర్తించారు. అలాగే, ఆ పక్కనే ఉన్న అన్నారపు రాజేందర్ కిరాణ షాపు తాళం పగులగొట్టి రూ.5,500లు అపహరించినట్లు గుర్తించారు. ఏనుమాముల పోలీసు స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి క్లూస్ టీంను రంగంలోకి దింపి ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టినట్లు ఇన్‌స్పెక్టర్ వివరించారు.

'పద్మశాలి' క్యాలెండర్ ఆవిష్కరణ



వరంగల్: తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా 2025వ సంవత్సరం క్యాలెండర్‌ను సంఘం కార్యాలయంలో హనుమకొండ జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి (డీఆర్‌డీఓ) మేన శ్రీను బుధవారం ఆవిష్కరించారు. తెలంగాణ పద్మశాలి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు కోడం రవిప్రకాష్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఆర్.బాలరాజు, పద్మశాలి ఉద్యోగ సంఘాల నాయకులు కె.రాజమౌళి, డి.సాయిరాజ్, బి.సురేష్, ఎ.నాగరాజు, జి.రాజమౌళి, ఎస్.లింగమూర్తి, కె.రమేష్, రజిత, శివప్రసాద్, గురుప్రసాద్, రాజ్‌కుమార్‌తో పాటు ఉద్యోగులు పాల్గొన్నారు.

అవగాహన

ఖిలా వరంగల్: రైల్వే పట్టాల సమీపంలో పతంగులు ఎగరవేయొద్దని జీఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సురేందర్ సూచించారు. వరంగల్ రైల్వేస్టేషన్ ప్రాంతంలో జీఆర్పీఎఫ్ పోలీసుల ఆధ్వర్యంలో యువతకు బుధవారం అవగాహన కల్పించారు.